# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత, బీమా అవగాహనను పెంపొందించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈరోజు బీమా సఖి యోజనను ప్రారంభించారు.

- ❖ రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సమక్షంలో అత్యాధునిక యుద్ధనౌక ఐఎన్ఎస్ తుషిల్ ఈరోజు భారత నావికాదళంలోకి ప్రవేశించింది.

- ❖ బంగ్లాదేశ్ తో సహృద్భావ వాతావరణం భారత్ కోరుకుంటోందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు.

- ❖ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా ఈరోజు అధికార విపక్షాల గందరగోళం మధ్య ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.

- ❖ అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించే యూపీఎస్సీ మెయిన్స్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి.

==========================

మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత, బీమా అవగాహనను పెంపొందించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హర్యానాలోని పానిపట్ లో ఈరోజు బీమా సఖి యోజనను ప్రారంభించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటూ.. స్థిరమైన ఆదాయం కల్పించేందుకు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) ఈ పథకాన్ని రూపొందించందని ప్రధాన మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన 18 నుండి 70 సంవత్సరాల వయస్సు గల మహిళలకు సాధికారత కల్పిస్తూ.. మొదటి 3 సంవత్సరాలు ఉపకార వేతనంతో కూడిన ప్రత్యేక శిక్షణ ఉంటుందని, ఆ తర్వాత వారిని ఎల్ఐసి ఏజెంట్లగా నియమిస్తారని తెలిపారు. మహిళా ప్రగతికి అవరోధమైన సామాజిక ఇబ్బందులను ప్రభుత్వం తొలగిస్తుందని నరేంద్రమోడీ ప్రసంగిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

అంతకముందు రాజస్థాన్ లోని జైపూర్ లో రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ సమ్మిట్ ను ప్రధానమంత్రి ప్రారంభించారు. జైపూర్ ఎగ్జిబిషన్ అండ్ కన్వెన్షన్ సెంటర్ లో 3 రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ప్రధానమంత్రి మాట్లాడుతూ 'సంస్కరణ, పనితీరు, పరివర్తన' అనే సూత్రాన్ని అనుసరించడంతో అభివృద్ధి ప్రతి రంగంలోనూ కనిపిస్తోందన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు భారత్ వైపు ఆసక్తి కనబరుస్తున్నారని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బిఐ) నూతన గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. సంజయ్ మల్హోత్రా నియామకానికి క్యాబినెట్ నియామకాల కమిటీ ఈరోజు ఆమోదం తెలిపింది. రాజస్థాన్ కేడర్ 1990 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన సంజయ్ మల్హోత్రా ప్రస్తుతం కేంద్ర రెవెన్యూ శాఖ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఆయన ఈ పదవిలో ఈ నెల 11 నుండి మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బంగ్లాదేశ్ తో సుహృద్భావ వాతావరణం భారత్ కోరుకుంటోందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. ఢాకాలోని భారత్-బంగ్లాదేశ్ విదేశాంగ కార్యాలయం కన్సల్టేషన్ లో ఈరోజు జరిగిన చర్చల్లో భారత ప్రతినిధి బృందానికి ఆయన నాయకత్వం వహించారు. బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి జషీమ్ ఉద్దీన్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో జరిపిన చర్చల అనంతరం విక్రమ్ మిస్రీ పాత్రికేయులతో మాట్లాడుతూ ...

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రష్యాలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సమక్షంలో అత్యాధునిక మల్టీ రోల్ స్టెల్త్ గైడెడ్ క్షిపణి యుద్ధనౌక "ఐఎన్ఎస్ తుషిల్" భారత నావికాదళంలోకి ప్రవేశించింది. ఈ నౌకను ప్రారంభించడం దేశ సముద్ర భద్రతకు గర్వకారణమని, భారత్ - రష్యాల మధ్య దీర్ఘకాలిక స్నేహపూర్వక బంధంలో ఇదొక ముఖ్యమైన మైలురాయి అని రాజ్ నాథ్ సింగ్ అభివర్ణించారు. "ఆత్మనిర్భర్ భారత్" అనే భారత దార్శనికతకు రష్యా మద్దతు ఇవ్వడం ఇరు దేశాల మధ్య లోతైన స్నేహానికి ప్రతీక అని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఐఎన్ఎస్ తుషిల్ సహా పలు నౌకల్లో మేడ్ ఇన్ ఇండియా పాశస్త్యం నిరంతరం పెరుగుతోందని తెలిపారు. రష్యన్, భారత పరిశ్రమల సహకార నైపుణ్యానికి ఈ నౌక నిదర్శనమని రాజ్ నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈరోజు తిరిగి ప్రారంభమయ్యాయి. వివిధ సమస్యలపై విపక్షాలు ఆందోళనలు చేపట్టడంతో పార్లమెంటు ఉభయ సభలు ఈరోజు పలు మార్లు వాయిదా పడ్డాయి. ఒక ప్రముఖ భారతీయ వ్యాపార సమూహంపై వచ్చిన లంచం ఆరోపణలపై అధికార విపక్షాల గందరగోళం మధ్య ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి. ఇదిలా ఉండగా ఇప్పటివరకు 8.72 లక్షలకు పైగా స్థిరాస్తులను, 16 వేల 713 చరాస్తులను ఆయా రాష్ట్ర వక్ఫ్ బోర్డులు డబ్ల్యూఏఎంఎస్ఐ పోర్టల్లో నమోదు చేసినట్లు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఈరోజు రాజ్యసభకు తెలిపారు. ఇప్పటివరకు 994 వక్ఫ్ ఆస్తుల యాజమాన్యాన్ని ఇతర పార్టీలకు బదలాయించడం జరిగిందని మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అఖిల భారత సర్వీసుల్లో (యూపీఎస్సీ) ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించే యూపీఎస్సీ మెయిన్స్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ప్రిలిమ్స్ లో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20 నుంచి 29 వరకు మెయిన్ పరీక్షలు నిర్వహించగా ఈ ఫలితాలను యూపీఎస్సీ ఈరోజు సాయంత్రం విడుదల చేసింది. వ్యక్తిగత మౌఖిక పరీక్ష (ఇంటర్వ్యూ)కు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను హాల్‌టికెట్ నంబర్లతో విడుదల చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు వచ్చే సంవత్సరం ప్రారంభంలో జరగనున్ననేపథ్యంలో ఇప్పటికే తొలి జాబితాను విడుదల చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ ఈరోజు తమ అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా జంగ్‌పురా నుంచి పోటీ చేస్తున్నారని ప్రకటించారు. ఎన్నో పర్యాయాలుగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పటపడ్ గంజ్ స్థానం నుంచి ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీలో చేరిన ప్రముఖ యూపీఎస్సీ కోచ్ అవధ్ ఓజా ఈసారి పోటీ చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఈరోజు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్ ఖర్ 1946 లో ఇదే రోజున భారత రాజ్యాంగ పరిషత్తు మొదటి సమావేశం జరిగిందని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం దిశగా భారతదేశ ప్రయాణంలో అది ఒక చారిత్రాత్మక మైలురాయిని జగదీప్ ధన్ ఖర్ అభివర్ణిస్తూ ....

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సిరియా ఐక్యత, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించడానికి అందరం కలిసి కృషి చేయాలని భారత్ పేర్కొంది. సిరియాలో పరిస్థితిని, జరుగుతున్న పరిణామాలను పర్యవేక్షిస్తున్నామని విదేశాంగ శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. సిరియా రాజధాని డమాస్కస్ లోని భారత రాయబార కార్యాలయం భారతీయ సమాజంతో సంప్రదింపులు జరుపుతోందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా పశ్చిమాసియా నుంచి వెళ్ళిపోయిన సిరియా మాజీ అధ్యక్షులు బషర్ అల్ అసద్ కుటుంబంతో సహా మాస్కో చేరుకున్నారు. మానవతా దృక్పథంతో వారికి రష్యా ఆశ్రయం కల్పించిందని క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి. అబూ మొహమ్మద్ అల్ జోలానీ నేతృత్వంలోని తిరుగుబాటు దళాలు రాజధాని డమాస్కస్ ను తమ ఆధీనంలోకి తీసుకోవడంతో బషర్ అల్ అసద్ దేశం విడిచి వెళ్లిపోయారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్ముకశ్మీర్, లడఖ్, గిల్గిత్, బాల్టిస్థాన్, ముజఫరాబాద్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, తూర్పు రాజస్థాన్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, హిమాచల్ ప్రదేశ్ లో రానున్న 3, 4 రోజుల్లో చలిగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. రానున్న 3 రోజుల్లో వాయవ్య, మధ్య, తూర్పు భారతదేశంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుండి 4 డిగ్రీల సెల్సియస్ తగ్గుతాయని ఐఎండీ తెలిపింది. రేపు తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్ లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =